## పేలుడు పదార్థాల కేసులో ఒకరికి మూడేండ్ల జైలుశిక్ష

వినాయక్‌నగర్, అక్టోబర్ 21 : పేలుడు పదార్థాల కేసులో ఓ నిందితుడికి మూడేండ్ల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా సెషన్స్ జడ్జి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. కామారెడ్డి జిల్లా జంగంపల్లికి చెందిన గండి కోట మల్లయ్య ట్రాక్టర్‌లో పేలుడు పదార్థాలు తరలిస్తుండగా భీమ్‌గల్ పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో సోమవారం హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి మూడేండ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

## రోడ్డుపై న్యూసెన్స్ చేసిన వ్యక్తికి రెండు రోజులు..

వినాయక్‌నగర్, అక్టోబర్ 21 : నిజామాబాద్ నగరంలోని త్రీ టౌన్ ప్రాంతానికి చెందిన సంఘీ రమేశ్ రోడ్డుపై న్యూసెన్స్ చేయడంతో రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ సోమవారం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని హమాల్‌వాడికి చెందిన సంఘీ రమేశ్ ఆదివారం తన తమ్ముడి భార్యతో గొడవపడ్డాడు. రోడ్డుపైకి వచ్చి న్యూసెన్స్ చేయడంతో సమాచారం అందుకున్న మూడో టౌన్ ఎస్సై మహేశ్ కేసు నమోదు చేసి, సోమవారం కోర్టులో హాజరుపర్చారు. సంఘీ రమేశ్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- అదనపు కలెక్టర్ అంకిత్



బాధిత కుటుంబానికి గిఫ్ట్‌ప్యాక్‌ను అందజేస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్



ఏడో బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న పోలీసు అధికారులు, బాధిత కుటుంబీకులు

వినాయక్‌నగర్/ డిచ్‌పల్లి/ జక్రాన్‌పల్లి/ఎడపల్లి, అక్టోబర్ 21 : దేశ రక్షణలో రక్షణ దళాలు, పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. విధినిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకు నివాళులర్పించారు.అదనపు డీసీపీ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 214 మంది, నిజామాబాద్ పరిధిలో 1986 నుంచి ఇప్పటివరకు 19 మంది పోలీసులు ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అమరవీరుల కుటుంబాలకు గిఫ్ట్‌ప్యాక్‌లు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ బస్వారెడ్డి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. డిచ్‌పల్లిలోని పోలీస్ 7వ బెటాలియన్‌లో ఇన్‌చార్జి కమాండెంట్ సురేశ్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరులకు బాధిత కుటుంబీకులతో కలిసి నివాళులర్పించారు. 7వ బెటాలియన్‌కు చెందిన 11 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. బాధిత కుటుంబాలను ఎల్లవేళలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కేపీ శరత్‌కుమార్, కేపీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై తిరుపతి, ఏఎస్సైలు సుశీల్‌కుమార్, వెంకట్ ఆధ్వర్యంలో, ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు.


























